వేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు

- మొయినాబాద్‌కు తగ్గనున్న దూరం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్: గత ప్రభుత్వంలో పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రజా ప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ అప్పటి ప్రభుత్వ హయాంలో అధికారులు చిన్నమంగళారం వాగు బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేయలేకపోయారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. మారుమూల గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామ సమీపంలోని మూసీ వాగుపై వంతెన లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిన్నమంగళారం మహరాజ్‌పేట్ గ్రామాలను కలుపుతూ మూసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. అప్పట్లో నిధులు మంజూరుకాకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. గత సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన చిన్నమంగళారంలో అప్పటి ప్రజాప్రతినిధులు ఈ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ పనులు ప్రారంభించారు. దీనికోసం అధికారులు రూ. 5కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు కన్‌స్ట్రక్షన్ రూరల్ రోడ్స్ నిధులను ఉపయోగించుకుంటున్నారు. బ్రిడ్జి పనులు పూర్తయితే వివిధ గ్రామాలకు మొయినాబాద్ మండలం నుంచి శంకర్‌పల్లితో పాటు సంగారెడ్డి, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలవుతుంది. దాదాపు 50శాతం పూర్తయినట్లు ఎస్ఆర్ ఇండస్ట్రీ యాజమాన్యం తెలిపింది. 8 నెలల నుంచి అక్కడ పనులు చేస్తున్నామన్నారు. వచ్చే వర్షాకాలంలోపే నిర్మాణ పనులను పూర్తి చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.


మూసీ వాగుపై కొనసాగుతున్న పనులు

రైతులకు మేలు..



మండలంలోని చిన్నమంగళారం బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా సాగుతుంది. ఈ పనులు పూర్తయితే రైతులకు మేలు జరుగుతుంది. మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు శంకర్‌పల్లి మార్కెట్‌లో తమ వస్తువులు, పంట అమ్ముకోవడానికి వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. చిన్నమంగళారం, మహరాజ్‌పేట్, జనవాడ, మోకిల వివిధ గ్రామాలతో పాటు శంకర్‌పల్లికి వెళ్లేందుకు దూరం తగ్గుతుంది.

– సుకన్య, సర్పంచ్, చిన్నమంగళారం


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వర స్వామికి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా దేవాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల నిర్వహణకు అర్చకులు, అధికారులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయం ఎంతో పురాతనమైనదన్నారు. భక్తుల కోరికలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందిన దేవాలయమని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీ అరుణ, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ సంపత్‌కుమార్, మోహన్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీనివాస్, అప్పి, రాజేందర్ రెడ్డి, నెహ్రూ నాయక్, ఈట శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ విశిష్టత కాపాడాలి : ఎమ్మెల్యే

పట్టణంలోని మళయాళ స్వామి ఆశ్రమ విశిష్టతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని మలయాళ స్వామి ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమంలో నిత్యం అన్నదానం, దూపదీప, నైవేధ్యాలు యథావిధిగా నిర్వహించే విధంగా కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింలు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బండారు రమేశ్, అగ్గనూరు బస్వ, నాగిళ్లగోపాల్‌గుప్తా, స్వరాజ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు తెల్లమచ్చలపై ఏఎన్‌ఎం ఝాన్సీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుగౌడ్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడం కోసం వైద్యులు ఇచ్చే సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యాభ్యాసం సక్రమంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ శిరీష

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను అభివృద్ధి చేసేందుకు విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ టి శిరీష డిమాండ్ చేశారు. చేవెళ్లలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని ఇంకా నియమించలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యా పాత్ర కీలకమన్నారు. వ్యవస్థను పటిష్ఠం చేస్తేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు ఆశాఖ మంత్రి ఉంటేనే పనులు జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే విద్యాసంస్థల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని పరిష్కరించే వారు కరువయ్యారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిని ప్రభుత్వం నియమించాలని శిరీష పేర్కొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్

మొయినాబాద్ రూరల్: యువతి, యువకులు స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలో హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా మర్‌పల్లికి చెందిన శ్రీనివాస్ జంక్షన్ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో పాలుపంచుకోవాలన్నారు. కుటుంబ పోషణకు తమ వంతుగా సహకారం అందించాలన్నారు. అందరూ బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతీ, యువకులు, ఉద్యోగాలు లేవని నిరుత్సాహ పడకుండా పోటీపరీక్షలకు సిద్ధమవుతూ ఉద్యోగాలు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి భరత్, రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు బిస నర్సింహ్మ, మండల అధ్యక్షుడు మానయ్య, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, ఫుడ్ కోర్టు ప్రొప్రైటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాల ఏర్పాటు అభినందనీయం

సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ క్రీడా మైదానాల ఏర్పాటు అభినందనీయమని చందనవెల్లి సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చందనవెల్లి గ్రామంలో మొక్కలు నాటి, ఓపెన్ జిమ్ పరికరాలను, వాకింగ్ ట్రాక్‌ను మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు చందన, అజిత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి మైదానాలు ఉపయోగ పడుతాయన్నారు.

అవినీతి ఆరోపణలు అవాస్తవం


మాట్లాడుతున్న మత్స్యసహకార సంఘం నేతలు

- మత్స్యసహకార సంఘం నేతలు

నందిగామ: మత్స్యసహకార సంఘంలో అవినీతి చోటు చేసుకుందని కొంత మంది చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని ఆ సంఘం నేతలు స్పష్టం చేశారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో మత్స్యసహకార సంఘం నాయకులు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత్స్యశాఖ సొసైటీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని, సొసైటీ సభ్యుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగానే చేస్తున్నారన్నారు. తాము ఏ అధికారికి కూడా ఒక్కపైసా ఇవ్వలేదని వారు చెప్పారు. తాము అధికారుల పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నామని, సొసైటీలను అభివృద్ధి చేస్తూ, సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నందిగామ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు యాదయ్య, నర్సప్పగూడ సంఘం అధ్యక్షుడు కొడిచర్ల యాదయ్య, చేగూరు సంఘం అధ్యక్షుడు రవి, మధురాపూర్ సంఘం అధ్యక్షుడు సతీశ్, కార్యదర్శి నీరటి అశోక్, సంఘం మాజీ అధ్యక్షుడు నీరటి నర్సింహా, సభ్యులు చందన్, రవీందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు చేసిన సేవలు అభిన ందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పదవీకాలం పూర్తిచేసుకున్న సర్పంచులు, ఉప సర్పంచులను శాలువాకప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచుల పదవులు కత్తిమీద సాములాంటిదన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి వారు చేసిన త్యాగం గొప్పదన్నారు. గ్రామాల్లో సర్పంచులు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం పలువురు సర్పంచులు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు సరైన నిధులు మంజూరు చేయలేదన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంకోసం అనేక విధాలుగా ఒత్తిడి తెచ్చినట్లు వారు తెలిపారు. కొన్ని పంచాయతీల్లో పంచాయతీ పాలకవర్గం కాకుండా అధికార పార్టీ ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు చేసినట్లు ఆరోపించారు. మరికొన్ని పంచాయతీలకు చేసిన అభివృద్ధి పనులకు నిధులు సైతం ఇవ్వలేదని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సర్పంచులకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జే. సుదర్శన్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందించినట్లు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మిర్జాగూడ సర్పంచ్ రవీందర్ గౌడ్ అన్నారు. సర్పంచ్ పదవి కాలం ముగియడంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి శ్రీనివాస్‌రెడ్డికి రికార్డులు అప్పగించారు. శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులను సన్మానించారు. ప్రతీ ఒక్కరికి వాల్‌క్లాక్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5సంవత్సరాల పాటు తనకు సహకరించిన ప్రజలకు, పాలకవర్గం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంతికిషన్, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్ అరవింద్‌రెడ్డి, డైరెక్టర్ ఒగ్గు అంజయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి: పాలకవర్గాన్ని సన్మానించిన రవీందర్‌గౌడ్, కురుమ వెంకటేశ్

సాంఘీకశాస్త్ర అధ్యయనం తప్పనిసరి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అక్బర్

- మండల విద్యాధికారి అక్బర్

శంకర్‌పల్లి: సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి సాంఘీకశాస్త్ర అధ్యయనం తప్పనిసరిగా దోహద పడుతుందని శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్ పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండల సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. దీనికోసం మండలంలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశరు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాలను గమనించాలని సూచించారు. మంచి క్రమశిక్షణతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు. మహనీయుల చరిత్రను పఠనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ టీచర్స్ ఫోరం శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు ఆశీర్వాదం, కస్తూరిబా గాంధి పాఠశాల ప్రత్యేక అధికారి మధురవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులు.. ఉపాధ్యాయులైన వేళ


స్వయం పరిపాలన దినోత్సవంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్‌తో విద్యార్థినులు

షాద్‌నగర్ రూరల్: విద్యను అభ్యసించే విద్యార్థినులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి స్నేహితులకు పాఠాలు బోధించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో గురువారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ శంకర్‌రాథోడ్ హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

బహుజన రాజ్యం కోసం కృషి

షాబాద్: బహుజన రాజ్య స్థాపనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీఎస్పీ ప్రధాన కార్యదర్శి విజయఆర్య క్షత్రియ, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బర్క కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దొరల రాజ్యం నడుస్తుందన్నారు. బహుజనుల రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే బీఎస్పీ పోరాటం చేస్తోందన్నారు. బహుజనులందరూ కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అడుగు జాడల్లో పనిచేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న జయరాజ్, కార్యదర్శి శ్రీశైలం, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి రాజమహేంద్రవర్మ, చేవెళ్ల కమిటీ అధ్యక్షుడు చందు మహరాజ్, మండల అధ్యక్షుడు కందివనం శ్రీశైలం, కోశాధికారి పెండ్యాల చందు, నాయకులు చందు, శ్రీనివాస్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడం మానుకోండి

- జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత

కొత్తూరు: మహిళలను, మహిళా ప్రజా ప్రతినిధులను అగౌరపరచండ మానుకోవాలని కొత్తూరు జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి అన్నారు. పట్టణంలో గురువారం మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో జెడ్పీనిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సర్పంచ్ ప్రభాకర్‌ముదిరాజ్‌లు తనకు, జెడ్పీచైర్‌పర్సన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రారంభించడం బాధాకరమన్నారు. ఈ పనుల కోసం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డిల సహకారంతో తాను నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అధికారులు శిలాఫలకం ప్రారంభోత్సవంలో తమకు సమాచారం ఇవ్వకుండా అగౌరపరిచినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారుల తీరును నిరసిస్తూ ఉన్నతాధికారులకు తాను ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెండెకృష్ణ, మధుసూదన్‌రావు, నర్సింహ్మారెడ్డి, శ్రీశైలం, డోలీ రవీందర్, బాలయ్య, మాజీ సర్పంచులు తులశమ్మ, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీలత

ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవడం సరికాదు

షాద్‌నగర్ రూరల్: ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయకుండా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకోవడం సరైనదికాదని జేఏసీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని రతన్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం పాత్ర అమోఘమని అన్నారు. రాష్ట్ర హై కోర్టులో పిటిషన్ దాఖలుచేసి ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యమకారుల సభను విజయవంతం చేయండి

చేవెళ్ల: ఈ నెల 4వ తేదీన చేవెళ్లలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సభకు హాజరుకావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఉద్యమకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సబను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రులను చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి ఈదులపల్లి రాములు, ఫోరం మండల అధ్యక్షులు కరికె మల్లేశ్, కుమ్మరి చెన్నయ్య, మండలకార్యదర్శి శివగల సత్యానందం, సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

మత్స్యశాఖ కమిషనర్‌కు సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తూరు: రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యను గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు ముదిరాజ్ సంఘం నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్‌కు విన్నవించినట్లు తెలిపారు. అంతేకాకుండా మత్స్యకారులకు పనిముట్లు, వలలు, తెప్పలు ఇవ్వాలన్నారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారన్నారు. చేపలకు కనీస మద్దతు ధర నిర్ణయించడంతో పాటు మార్కెట్లను అందుబాటులోకి తేవాలని వారు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు సురేష్, నర్సింహ్మా, కుమార్, గోపాల్, లక్ష్మయ్య, శంకరయ్య, బాబు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారులకే పాలనా బాధ్యతలు

- ఒక్కో అధికారికి రెండు, మూడు జీపీలు ఇచ్చే అవకాశం
- నేటి నుంచి షురూ

చేవెళ్ల: సర్పంచుల పదవీకాలం గురువారం ముగియనుండడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలవుంతుంది. శుక్రవారం నుంచి గ్రామాలకు వారు ఇన్‌చార్జిలుగా వ్యవహరించబోతున్నారు. ఇప్పటికే అన్నిశాఖల నుంచి అధికారుల జాబితాలను సిద్ధం చేయించి ఆయా గ్రామాల వారీగా గెజిటెడ్, నాన్‌గెజిటెడ్‌లతో కలిపి జాబితాను సిద్ధం చేశారు. జీఓ 5 ప్రకారం ప్రత్యేకాధికారులుగా గ్రామాలకు గెజిటెడ్ అధికారులు మాత్రమే ఉండాలనే నిబంధనతో మండలంలో నియమించిన జాబితాను తొలగించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం గెజిటెడ్ అధికారులతో కూడిన జాబితాను తయారు చేసేపనిలో అధికారులు నిమాగ్నమయ్యారు. దీని ప్రకారం ఆయా మండలాల వారీగా గెజిటెడ్ అధికారుల లిస్టుననుసరించి ఉన్న పంచాయతీలను వారికీ డివైడ్ చేస్తున్నారు. క్లస్టర్ల వారీగా నియమించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో గెజిటెడ్ అధికారులు తక్కువగా ఉన్న మండలాల్లో ఒక్కో అధికారికి రెండు లేదా మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామాల జాబితాను మండలాల వారీగా సిద్ధం చేసి ఆర్డర్‌లు అందజేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు.

37 పంచాయతీలకు 16మంది అధికారులే..

చేవెళ్ల మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీంతో అధికారులు ముందుగా సిద్ధం చేసుకున్న జాబితా ప్రకారం 16 మంది గెజిటెడ్ అధికారులను గుర్తించారు. మరో 21 మంది నాన్‌గెజిటెడ్ అధికారులను కలిపి 37 మందికి ప్రత్యేకాధికారులుగా మొదట జాబితాను సిద్ధం చేశారు. వీరికి గురువారం ప్రత్యేకాధికారుల సమావేశం నిర్వహించాలని సమాచారం అందజేశారు. కాని మళ్లీ ఉన్నతాధికారులనుంచి వచ్చిన సమాచారం మేరకు వాయిదా వేశారు. ప్రత్యేకాధికారులుగా గెజిటెడ్ అధికారులే ఉండాలని ఆదేశాలు రావటంతో కొత్త జాబితాను సిద్ధం చేస్తున్నారు. దీని ప్రకారం మండలంలో 16 మంది గెజిటెడ్ అధికారులకు 37 పంచాయతీలను అప్పగిస్తూ జాబితాను సిద్ధం చేస్తున్నారు. దీంతో ఒక్కో అధికారికి రెండు గ్రామాలు ఐదు మంది అధికారులకు మూడు గ్రామాల చొప్పున బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. అయితే ఏ అధికారికి ఏ గ్రామం అనేది రాత్రి వరకు ఆయా అధికారులకు ఫోన్‌మెసేజ్ చేయనున్నట్లు సమాచారం.